# తరాల నాటి తెగులు

చేతుల కాగితం పట్టుకొని చూపు మన ధ్యాసే విడిచి ఎక్కడో చుక్కల పర్వతం చూస్తున్నట్లు రెండు మరిచి పలక మంచము మీద కూర్చున్న రాధమ్మకు ఈశ్వరమ్మ పిలుపుతో తెలివి మళ్లి ఈలోకానికి తిరిగి వచ్చినట్లు ఉలిక్కిపడి లేచింది. ''ఏం రాదమ్మ! ఎన్నడూ లేంది బీడువడ్డట్లు బీరువోయి నడిమంచాన గూాల వడ్డవూ? అని అడుగుతున్న ఈశ్వరమ్మను చూస్తూ '' ఆ ఏం లేదు, రా! కూసో! ఎంత సేపాయె నీవొచ్చి ? ఎచ్చమ్మ తల్లి ఉత్తరంల కత రాసి పంపితే ఇందాకే సదువుకోని ఇది కతా ? నిజమా ? అంట రొండెర్గని తనంల జిక్కి మరుపున వడ్డ. అందుకే నీవొచ్చిన పొలిపెర గుడ నా కండ్ల వడ లేదు సుమా ! అని రాధమ్మ అంటుంటే

ఆఁ ఎట్లవడ్డదమ్మా! కనికట్టు గట్టినట్ల నిన్ను మర్సి కతల మునిగితి వాయె. కమ్మగ కత జెప్పుకం మీ ఎచ్చమ్మకు కొత్త గన్కనా ? కత ముందు వుట్టి తాను ఎన్క వుట్టింది గదా ? మరి ఇందుట్ల కొత్త యాండదని ? అది గాకుండ ఈ నడ్మ మీసెల్లెలు కృష్ణమూర్తి కతలల్ల మున్గి తేలుతుండె. ఎనుకటి సాముల వారి తీర్గ ముప్పొద్దులూ అముచ్చట్నే.

యశోదమ్మ కృష్ణయ్యను తొడల మీదేస్కోని ఎన్నలు వెట్టి నీళ్ళువోసి, పైదుడిసి, పొగేసి, పట్టంగిదొడగి, దువ్వి కొండిగట్టి ముద్దిచ్చుకోని మురిసిందనో ? కాకుంటె గోపెమ్మలూ, కృష్ణయ్యలూ గలిసి ఎన్నెల రాత్రిళ్ళు ఎవ్వరు గానకుండ మొకాలకు అర్ధాళం పూస్కోని పిల్లనగొయ్య వూదంగ పుంగిళ్ల పూసింద్రనో గద ? కతలన్నీ! అవి యింటుంటే యా రాయి చెమర్చకుండ ఉంటది, తల్లీ! అని ఈశ్వరమ్మ నోటికి తాళం వేసినట్లు అడ్డం తగులు కుంట.-

'' ఆహా! ఈ త్యాప అదేం లేదు. ఆదేవుండ్ల కత గాదు. ఆజోలే లేదు. ఆకృష్ణ మూర్తి సార్శకే వోయినట్ల లేదు. అదేం కతనో? నాకే దెల్వదు గని ఆ కత మట్కు నామ నుసును సూదంటు రాయోలె గుంజుకుంట సల్ల కవ్వందిప్పినట్ల తిప్పుకుంట నన్నంత

అతులకుతులం పడజేసింది. నా కెర్కా లేకుండగనే నేను ఆ అల్లుల వడి యాడికో కొట్టు కపోయిన, అందుకే నీవొచ్చిన సంగతి గుడ సూచాయగ నన్ను దెల్వలేదు. ఇదంతెందుకు! నీవే యిను మళ్ల సదువుత '' అంటూ కథ చదవటం ప్రారంభించింది.

అక్కా! ఈసారి నీకో కొత్త కత జెప్త యిను. కొత్త మాట ఎత్తుడే కష్టం. ఆమాట యినంగనే పైరగాలి జొర్రిన కోడెదూడోలె మాబావచెవులు నిక్కవొడ్సుకుంటడు. అమ్మో! అప్పుడే బొమ్మలు ముడెయ్యకమ్మ! ఆ ముడిప్ప మీ ఆయన దుంకగలడు. అయినా నీమొగణి ముచ్చట నాకెందుగ్గాని కత యిను. ఈ కతకొత్తంటే అచ్చంగ కొత్తని గాదు, పాత పురాణమే. ఎంత పాతదంటవా ? అబ్బో చెప్పుడు కష్టం.

అది శనా పాతది నీవూ, నేనూ, బావా, బావ ముత్తవ్వ లక్కవ్వ, లక్కవ్వ మెడల బంగారు కంటె పుట్టక ముందు. నీ ఆడిబిడ్డ యెంకటమ్మ పూరు రంగాపురంల రంగనాదసామి గుడి ఎదురుగ పున్న జమిడినాగుల కాడి రాగి చెట్టు ముందరేసిన రోలు రుబ్బుగుండు పుట్టకముందు మన పూరి పెద్ద మర్రి తొర్రలగూసుండే పవిడి కంటె దాని సూపెట్టుకోని కూసుండె పాలపిట్ట పుట్టక ముందు. రెడ్డిగట్టు సొర్కాలకు కాణంగి రాక ముందు. మావూరి తాటి తోపులల్ల వుండే ముసలి మాను మీద గూసుండె పెద్ద గద్ద పుట్టక వుందు. వానలు ఎక్క పట్లు వట్టంగ బూతల్లి వట్టివోయి కరువు రాంగ కడుపాకలికి మంది రాగడి బుర్ర తిన నేర్వక ముందు. మనండ్ల తడి బట్ట తోటి గొంతులు గోసె విద్దె పుట్టక ముందు . నమ్మినోణ్ని నడీపుల వొడ్సుకం నేర్వక ముందు పుట్టింది.

కాలం పొడుగున ఎందరు సచ్చినా, ఎందరు బతికినా అది మట్కు సావ కుండా సెక్కు సెదరకుండా మన నీడోల్నే మనెంబడే నడుస్తున్న కత. ఈ కత తరాల్నాటి తాతలకు ఉగ్గులు వెట్టి దగ్గులు నేర్పిందె. అందరికి దెలిసిందే. అయినా ఎప్పటికి కొత్తదె ?. అందుకె యిన మంటుండ.

ఈకత బూమ్మీద ఇప్పడే పొట్మరిల్లినట్ల, నానోట్లకెల్లే తొల్త దుసిపడ్డట్ల కానక కానక కన్నట్లు నీరయికల మీద మీయత్త నాజూకుగ కసీద దీసినట్ల అవుసుల పానకాలు కంటి రెప్ప ప్రమాణంగ తీగె దీసి నా బంగారు నాను అల్లినట్ల పట్కారి ఎంకమ్మ సీనిబొమ్మకు పూసల పోషాకు గుచ్చినట్ల ఊర విచ్చుకలు గూళ్లు అల్లినట్ల ! నీబుంగి నీకు జడేసి మొగలిపూతొడుగుల కనకాంబురాలు కుప్పినట్ల ! మ్యాదర బాలయ్య పుట్కలు అల్లినట్ల ! సరంబలి పుట్టమన్ను గలిపి అసలు దొక్కినట్ల ! దొంతులు వేర్పి

నట్ల, కొత్తకూ, పాతకు ఏకంగ ఒక్కటే చెత్రి వట్టినట్ల! ఆలోచన పందిళ్లు కప్పినట్ల చెప్త. అయ్యో! అక్కా! అదేందే నీ సూపు కత మీద కెళ్ళి యాడికో మళ్లతుండది.

ఉష్! అదా సంగతి!

అక్కా! పందిల్లనంగానే మెళ్ళ చంద్రహారం ఏసుకోని చేతుల అడుక్కొత్తు వట్టు కోని నిలువునామందీర్సి చెంపన కాటిక సుక్కతోటి సూడ సక్కనై నిలువెత్తున వచ్చిన పెండ్లికొడుకు సోకు దలుసుకుంట సెమటలు వోస్తున్నవా తల్లీ! వొద్దు తల్లీ! వద్దు! ఇది నీ పెండ్లి పందిరి ముచ్చట కాదు. నా కత పందిళ్ల ముచ్చట.

అక్కా! అలుగకే! కత సదువ కుండనే కన్నెర్రజేసి నామీద గుర్రు మనకు ఎందుకంటవా? ఈకత సదివెటాళ్లకు నీవు యాడుంటువో? ఏంజేస్తుంటవో! మరి పొద్దున్నయితే నీ మొగణికి చా అందియ్యంగ ఈ చా సల్లగ జేసిచ్చినవ్ అనుకుంట తిరిగి నీకందిస్తె నిజంగనె సల్లగుండొచ్చు అని ఆత్రంగ అందుకోని ఓగుటక్కె దాగిఆడిన దొంగ నాట్కాకానికి అబ్బురం జూపినట్ల కౌచిప్పలసోంటి నీ కాట్కె కండ్లన్ని తెర్వంగ అమృతం అయిపోగలదని ఆకోపే గుంజక తాగుతుంటడో? లేక పోతె అంబటాళ్లకు మీపాలేర్ల పెండ్లాలు అంబటి దుత్తలు నెత్తిన వెట్టుకోని మొగుండ్ల కోసం సేండ్ల కాడికి పోతె తీర్యాటంగ నీవు కస్తూరి పసుపు, లవంగాలు గలిపి ఇసిర్న పెసరవిండిల పెరుగు మీగళ్లు కలిపి మీ యెంకమ్మ గట్టివెట్టంగ జాలట్ల జలకాలె ఆడుతుంటవో? లేకపోతె నీమేలు మాలె మీదికెక్కి ఎన్నెట్ల మడతలే సరిజేస్తుంటవో? కాక పొద్దుమూకంగ మీ ఇంటెనుక మల్లె పందిరి పక్క గద్దె మీద గూసోని మల్లేమరువం గల్పి దండలే కడ్తుంటవో? అదీ ఇది గాకుంటె? గుమ్మడి పండసోంటి నీకొడుకు నగేనగులు ఇల్లు వట్టకుంటె నీ ఒడే వట్టి నింపుకుంట గూసుంటవో? తెలువదు గనీ ఇను.

అక్కా! కతంటే రాజులూ మారాజులూ దేవలోకం దిగిరాగూడదు. జరిగింది జరిగినట్ల సూసింది సూసినట్ల జనంల పుట్టినట్ల ఉండాలంట. బావ చెంగురింగున గంతులేస్తడు గదా? మరి యిప్పుడు ఇనమను కతను, చూస్కో ఆ కత దెబ్బ.

అక్కా! నీవే చీర సింగారిచ్చినవో? నాకు దెల్వదు అయినా నీకు చిగురు పచ్చంటే ఇష్టం. నీకంటే నీక్కాదు తల్లీ మీ ఆయనకే! అందుకే నీకు దెల్వకుండనే నీవు గట్టిన చిగురు పచ్చంచు నించోళి జలతారు మళ్లచీర ఇడిసి ముత్కా చీర కట్టెటట్లు

నీవూ బావ పచ్చీసు ఆడంగ ఓడిన పందానికి పడ్డ బాకీ రాబట్టుకొనేటప్పుడు బావ గరుకు గడ్డం నొర్సుక పోంగ, కోరమీసం రాస్కపోంగ కొత్తగ బచ్చెన వోస్కాని ఇంగింత ఎర్రగయిన నీ చెంపల రంగు దిగిపోయెటట్ల మీ సోమక్క వండిన కోడికూర కాకర వడ్ల బియ్యపు పాలావు రుచి దప్పి నోటికి సప్పిడి కూటి వోకారం గలిగిచ్చేటట్ల, ఎండి గిన్నెల పెరుగు బువ్వ తినుకుంట మూతినిండ పులుముకోని పెరుగు బుడ్డోలె చేసుకున్న నీగార్వాల కొడుకుమూతే నీకు ముద్దురానట్ల, నీవేందో ఇంగోరి సొమ్ముదోసినట్ల ఇర్కటపు అరల పడ్డట్ల ఊపిరి మళ్లక తండ్లాడినట్ల, మీసాల మీద తేనెలొల్కే బుడుబడ్కపు మాటలు ఇంటున్నట్ల కపట వాదుల సేతుల వడి తెల్సుకొన్నట్ల. నీవేందో తప్పిదం జేసినట్ల, పొమ్మనలేకపొగ వెట్టినట్ల, పొగ యింట్ల జక్కినట్ల చెడి సుట్టాల ఇల్లు చేరినట్ల, నీవు ఇంగోళ్లకు బుణపడ్డట్ల, నీమనసు దోసినట్ల, నీకన్నుదెలిసినట్ల నీవు కరిగినట్ల నీ మీద యేందో పెద్ద బరువున్నట్ల చేస్తది.''

అంటూ చదవుకపోతూ వుంటే ఈశ్వరమ్మ అడ్డం తగుల్తూ ''రాదమ్మా నీ చెల్లెలు ఈ త్యాప మరీ ఇచిత్రంగ రాస్కం మొదలు వెట్టిందమ్మా! పురాగ చిత్తారి దించినట్ల జరిగిన ముచ్చట్లన్ని కండ్ల ముందట కదిలి ఆడుతున్నట్లే రాసింది.'' అని అంటూవుంటే ఆ మాటలు వినీ విననట్లు 'ఆఁ, రాయదా మరి? .' చిత్తారి చక్రవర్తి పెండ్లాం దాని బాణాలన్నీ ఇంతకూ నీ తమ్ముని మీదనే ఇసుర్తది. అయిందానికి, కాని దానికి ఆయినే గురి. ఈయన ఊకోక బల్లి తానల్లుకున్న జాలెల తానే ఇరుక్కసచ్చెనని ఫంతాలాడి దాన్నిగదిలిస్తె ఊకుంటాది? మరి! అది పండాకు పసరాకు రాలంగ జల జల దులుపుతుండది. అది సరేగని బావా మరదండ్ల ముచ్చట మనకెందుకు? కత యిను'' అంట మళ్ళ చదవడం మొదలు పెట్టింది.

అక్కా! పట్నంల మేం కొత్తగ కట్టుకొన్న ఇల్లు అదేనమ్మా నీ మరిది గారి బొమ్మల కొలువు నీకెరుకే గదా! కోరి చేసుకుంటి నమ్మ కోతి శివుణ్ణే అని ఏరి కోరి చేసుకున్న వన్నెల మొగోడు, చెమటోడ్సి కట్టుకొన్నకొంప. అమ్మో! తప్పు సోకులు రాసులు వోసిన భవంతి సుధర్మ అదే! ఆసింగారాల ఇంటి సుట్టూ చెప్పలేని లొల్లి మన సర్కారు జేసిన ప్రతి సట్టాన్ని ఎక్కిరిచ్చుకుంట పచ్చనోటుకు ఫకీరు చిప్పరా నీ కట్టు వాట్లు ఆంట ''ఓదిక్కు సీనిమ్మ. మరో దిక్కు రాత్రింబగళ్ళు బూమి దద్దరిల్లే సప్పుళ్లు. ముక్కులున్న పాపమా అనేటంతటి కంపులతోటి ఓ కార్ఖానా. ఓదిక్కు మూడంత్రాల

ముర్కి బంగుల,పడమటి దిక్కున పెద్ద బజారు. ఇంగదుమ్ముకూలొల్లికీ బొగ్గు పొగకూ తక్కువ యాండది ? ఇంత పకడ్బందిగ చుట్టూ గేరాయించిన మన పెద్ద మణుసుల నడుంగల ''నీవు ఎంత పుణ్యం జేసినవో యెచ్చా ! సృష్టికే మారురూపం దిద్దే మరిది దొరి కిందు అని నీవు మురిసే, నీ మరిది మూడువేల బొమ్మలున్న మా ఇల్లు ! అక్కా ! ఎత్తి పొడుచుస్తున్న ననుకోకు, ఉన్న వాస్తవం జెప్పుతున్న. సరే కతకు వొత్తం.

మాఇంటి సుట్టూ రేయింబగళ్లు ఒకటే లొల్లి, బండ్లూ, బస్సులూ, లారీలూ, ఇస్కూటర్లూ, మోటార్లూ, రొండంత్రాల బస్సులూ, జట్కాలూ, సైకళ్లూ, పండ్ల బండ్లూ, మిరపకాయ బజ్జీల బండ్లూ, పూరీపానీ దుకాణపు బండి, చెరుకు రసపు మిషను, బుర్కాలేని కల్లుకుండలబండి, కుష్టురోగపోండ్ల బండి, బిస్కోట్ల బండి ఉల్లిగడ్డల బండి, సోడానిమిలేటు కలరునీళ్ళ బండి, ఐస్క్రూటు బండి, పసిపిల్లల తోల్క పోయే బోను బండి, మొగపిల్లలు ఆడి పిల్లలు, ఉత్తగ బాట నడిసెటోళ్ళు, చేతుల సెయ్యేస్క పోయెటోళ్లు, చేతులు పట్లోనల్ల పెట్టుకోని సీటీ బజాయించుకుంట బోయె టోళ్లు నాట్కం తొక్కుకుంట నడి బజార్ల నడిసెటోళ్లు, చిటెకలేసెటోళ్లు, ఉమ్మిచ్చె టోళ్లు, బిచ్చగాళ్లు, బీడు వడ్డోళ్లు, మంచోళ్లు, చెడ్డోళ్లు అంతా నడుస్తరు. ఇంగ ఆడ ఆమూల మలుపుల్నే రెండు హోటళ్లు, నాలుగు సినిమాలు, పొటోలు దీసే దుకాణం, ఇష్టీలుబాసండ్ల దుకాణం ,సిగిలేటు, అగ్గిపెట్టెల దుకాణం, నల్లసారా, విలాయతు సారా దుకాణం,, మిఠాయి దుకాణం, చిరిదిండ్ల దుకాణం, పాను బీడీల డబ్బా), ఇంగా తీరొక్క దుకాణం, ఆణ్ణే ఒచెత్త కుండి గూడ ఉండది.

అది వుండ బట్టే పాపం ఆడోళ్ళు చెత్తంతా పొట్లాలు గట్టిస్తే రాత్రిళ్లు మొగోళ్లు తీస్కపోయి పారేసి వస్తుంటరు. ఈసెత్తకుండి ఎన్నాళ్ల నుండి ఉండదోగని ఉండది. నా పెండ్లి అయిన కాడ్నుండి ఆణ్ణే వుండది. అడుగంగ అడుగంగ సపాయోళ్లు ఈచెత్త కుండిని దీసి మూల మలుపున ఏసింద్రు. అదిగూడ ఎందుకంటారు? అయ్యొ తల్లీ ! మాయింటి పక్కకు వో పోలిసు అప్సరు కిరాయికొచ్చిండు.

అక్కా ! ఇవన్నీ ఓ యెత్తు నాకత కంతటికీ . ఈసెత్తకుండి వో యెత్తు . మా బావన్నట్లు కత కంతటికి ఇది కోలెంక బొక్క. అదే ఎన్నుపూస. అమ్మో అక్కా ! బావకు కోపమొస్తదే ! ఇంత చిన్న మాట రాసినందుకు మరేమందునబ్బా ? ఆ ' ఆయువు ఫట్టు ఊహుఁ ' మూల బీజం కాదు, మరి నాకు మాటలు రావాయె.

నీవే ఆ దొరనడిగి రాపిచ్చుకో.

అసొంటి సెత్త కుండిల బూడ్డి, చెత్తచెదారం, పండ్లతోళ్లు, ఇరిగిన డబ్బాలు, మురిగిన పండ్లూ, కోడిగుడ్లపొస్కు, మామిడిపిక్కలు టెంకాయ చిప్పలు, పగిల్న బోకులు, నజ్జిగిజ్జయిన బల్లులు, జిల్ల పురుగులు, మాడిచెక్కలు మా పక్క సింగు కార్ఖానల మురికి కంపు మన్ను, పడి సచ్చిన ఎలుకలు, తొక్కి సంపిన పిట్ట సిల్లలు, కత్తరిచ్చిన ఎంటికెలు, తీసిన గోర్లూ, పీకిన కోడి బూరు, ఎంగలి ఇస్తార్లు, కనిపారేసిన సంటి గుడ్లు, గుడ్డ పేలికలు, సంపిన పాములు, సచ్చిన ఎలుకలు, అడపాదడపా కాగితాలూ, సండుగకో సబ్బానికో కతాచిత్కంగా ఏసిన అంట్ల యిస్తార్లు వీటికోసం కుక్కలు, కుక్కలకన్నా కడహీనంగా బతికే బక్కసిక్కిన మణుసులు, మతిసెడ్డ తిక్కోళ్ళు ఎగబడ్తరు. ఆ దిక్కుసూస్తె మనం దిన్న సన్నబియ్యపన్నం మేకులోలె కుచ్చుకోకమానదు. బావైతే నేం తాగిన నల్ల కల్లు సీరైతదంట రొసెటోడె..

అక్కా ! తప్పయిందే మూతి దిప్పకు, నా అక్క బంగారు ! ఇంగో సారి అనను. చెంపలేసుకుంటున్న సూడు.

సరే గాని ఈ నడుంగల మాసెత్తకుండికి మరీ గిరాకి పెరిగింది. బట్ట కరువో కాగితం కరువో ?గని, ఈ కరువు పుణ్యమా అంట మరి నాలుగైదు జీవాలకు జీవగంజి వోసినట్లపని జూపింది. బట్టాకాగితం ఈ రెండు వస్తువలు యారూపుకంల వున్నా గిరాకి పలుకుతుండది మంది కొంచెవోతుండరు, అందుకని మా చెత్త కుండి ప్యాదోసికి బతుకు దెర్వు చూపిన నెలువు అంట దీవెనార్తి ఇత్తం. అక్కా నీకు తెలువందే ముండది. ?

కాలం రెక్కలు గట్టుకోని గిరగిరా దిరుగు తుంటే అంతకంటె ముందుకు పోద మని మనిషి వురుకుతుండడు. ఈవురుకుడు పంద్యాలల్ల ఎన్కవడ్తె కుదరదు. అందుకే సదువులఅక్కర ఎక్కువయింది 'ఇంగ మా యింటికి నాల్గు దిక్కుల ఎనిమిది పెద్దబల్లు, ఏడు చిన్నబల్లు తెర్సింద్రు. ఈ సదువుకునే పిల్లల రాకపోకల కోసం బస్సు లేసింద్రు. ఇగ సూడు తల్లీ ఎట్ల చెప్పిన ఇంటవ్ గని, ఆడి మొగ కొర్సి సీమలోలె సదువు లకు ఎగబడ్డ రనుకో ! రాంగ రాంగ ఆడి మొగకు ఏరు తార్లుడిగి ఒక్కటే బట్ట అయింది.

తీరు తీరు డిరస్సులు, ఏనిగె అడుగు లాగులు, గంట అడుగు లాగులు, గోట్టాల

లాగులు, ఏక శిస్తుగ దిగేసిన గౌన్లు, ఎత్తొంపులు గానొచ్చే బనీన్లు, గుత్తెంగ గుట్టిన గౌన్లు, లంగ జాకీట్లు, నైకర్లు, చెడ్డీలు, పొట్టి లంగాలు, మోకాళ్లమీది నైకర్లు, తొడల మీది చెడ్డీలు, వదులు లాగులు, పాయింట్లు, దోతులు, రెండు జడలు, భుజాల మీది కత్తెర్లు, నెత్తి మీది ముళ్లు, అడ్డం, జిలేబులు, ముంత కొప్పులు, ఎల్లిపాయెకొప్పులు, గద్దగూళ్లు, కోర మీసాలు, గుబురు మీసాలు , కత్తెర మీసాలు పేడిమూతులు, క్రాపులు , జునుపాలు, రింగులు, లోలాకులు, కమ్మలు , జుంకాలు, అత్తర్లు, చెముట కంపులు, చేతి సంచులు, చెత్రీలు, పాపోసులు ఒక్కటేంది ? అన్నీ అడ్డం దిడ్డం పెరిగినయి.

అక్కా ! యాడన్న బెల్లం వున్న కాణ్ణే ఈగలు ముసుర్తయ్ అంటరు, గని, కాదు మురికి వున్న కాణ్ణే ఈగలు ముసుర్తయ్ అంటే మంచిది, అందికే ఆడ తీరొక్క బిచ్చ గాడు, కాలున్నోడు, లేనోడు, కన్నున్నోడు, కన్నుగాననోడు, ఈడ్పుగాళ్ళోడు, తొంట నెయ్యోడు, తాకట్లోడు, తంటాలోడు, పల్లీలమ్మెటోడు, పండ్లిగిలిచ్చెటోడు మంది పిల్లను చాట్లేసి బాలెంతననెటోళ్ల, రోగి, రొష్టు, కూలికి కుష్టును మోసెటోడు, ఒకే తాడు ముగ్గురు గుడ్డోళ్లు, ఒక కుంటి, ఒక గుడ్డి యిట్ల ప్రపంచికంలవున్న సబ్బండ జనం తీరు తీరురూపకంల కానొస్తరు. ఈనడుంగుల గిరాకి వలుకని వస్తువ అంట లేదు. అందుకని నీళ్ళు లేని కాడ సేను వండిచ్చినట్ల మంది, ప్రతొక వస్తువల పైస పుట్టిచ్చుకం నేర్సింండ్రు.

ఈసెత్తకుండిల పడ్డ కాయితాలు కష్టం చేయశాతగాని పోరలు ఆ సెత్తకుండిల కాయితాలు ఏరుకోని ఆ ముల్లెలు ఈపునేస్కోని మోసుకుంట దొర్కిన ఎంగిలి బీడీలు ముట్టిచ్చి పీల్సుడు నేర్సుకున్నరు. అదోసోకు వాళ్ళకు.

అయితే ? సపాయి జవాన్ మట్కు తక్వదిన్నాడు? సేరుకు సవశేరుబంటి, ఇది జూసి ఈపనేందో ? కష్టం లేకుండ పైసలు వూరెసెల్మెతీరుగవుండది అంట అనుకోని, ఆసెత్తలేరే నిక్రుష్టపు బత్కులజూసి.-

అమ్మా ! ఈ ఇలాకనాది, నా యిలాకలున్న సెత్తకుండీలమీద హుకూమత్‌నాది, నన్నడ్గకుండ కుండీలకాయితాలు ఏర్తార్? ఖబర్దారు ! వుత్తపున్యానికి ఏరనిస్తనా ? నాకు నెలకు వోరూపాయి పన్ను గట్టాలె'' అంట కట్టడిజేసిండు. పన్ను గట్టినోళ్లు రాజమా ర్గంగ వొచ్చి, కుండి బోర్లిచ్చినప్పుడు కావల్సిన చెత్తాసెదారం ఏర్కోని సంచులల్ల నింపు కోని పోతుండిరి.

అక్కా ! నాఅదృష్టం ఏందో ? గని మాయింటెన్కగుడ వోనెత్తకుండి ఎల్లింది. దాని ముంగల్నె బస్ ఇస్టాండ్ వుండది. ఆ బస్సు దొర్క వట్టుకోనికె పొద్దున లేసింది మొదలు అణ్ణె అందరు పడిగాపులు గాస్తుంటరు. ఆడజరిగే ముచ్చట్లు చెప్పసిత్రాలనుకో!

ఓనాడు నేను ఏందో ? పనిమీద మిద్దెక్కి ఆదిక్కు వారజూసిన, అట్ల జూసెట్యాళ్లకు నాకు సీనిమ్మల చిత్రాలోలె కండ్లవడ్డవి. సూస్తుండంగనె ఆడ్కి ముర్కిని పుల్మకోని, పూరి కల్మశాన్ని అంత మోస్తున్న సంచిని బుజాన ఏస్కోని కాలీడ్సుకుంట, శనా సంబురంగ యింత కన్న సుకంలేదన్నట్ల నిలవడ్డడు వోదుడ్డెగాడు వాడిట్లవొచ్చి నిలవడ్డడో లేదో యింగో బొంతల మూట కాగితాల బరువు తోటి వొచ్చి నిలవడ్డడు.

ఈరొండు బొంతలు సాటిపోటి రాజకీయపు నాయకయ్యలోలె ఒగళ్లను ఒగళ్ల నర్కుత పొడుస్త అన్నంత గుర్రుగ జూస్కుంట, ఆ ముర్కి సంచులను ఆరాం కుర్సీలోలె జేస్కోని కూసున్నరు. ఆ ముర్కివాసనకు, బీడిల పొగకు తాళలేక ఆడపిల్ల లంత బిక్కమొకాలేసి దగ్గరికి జర్గి కూసున్నరు.

ఇంతట్లకె ఆడ్కి ఇదే బాబతు వో ఆడి రూపంవొచ్చింది. అదిలోపట గట్టింది పాతసీరనె, గని, అదికాన్రాకుండ మీద జగ్గున మెరిసే వోణి జుట్టింది. ఇంగ నైలాన్ నల్లటి దారాలన్ని జమజేసి జెడ అల్లి గూలాబి రిబ్బను గట్టి, ఈ పక్క, ఆపక్క సెంపలు దాకంగ పిలాస్టిక్ చెంకీల పూలువెట్టి, సంకల గంప వెట్టుకోని దానికి శాతనైనంత వొయ్యారంగ వొచ్చి నిలవడ్డది. అయ్యో ! చెప్పమర్శిన, రొండోబొంతలేదా ? వాణకి పాపం ముక్కు లేదు, అంటె ? సిన్నప్పుడు గండమాల వుట్టి ముక్కువోంగ రొండు బొర్రలు ఏర్పడ్డయి. ఆ ముర్కికి ఆశపడి ఈగెలు జొబ్బున మూగుతయ్. ఈగెల బయా నికి వాడు కిరికెట్ అయ్యలు పారేసిన టోపిని తెచ్చుకోని ముక్కుమీదకి గుంజు కోనిపెట్టు కుంటడు. అసోంటి వొంటి పుర్రోడు 'బాలి ' అంటె ? ఆడి బొంత కండ్ల వడంగనె కుశాలుగ లేసి 'బాలి ! దా ! కూసో ' అంట తనపక్కన సోటు జూపిండు.

ఇది జూసిన ఈడ్పు గాళ్లోడు, వోర్వలేక దిగ్గున లేసి బాలిని రెక్కవట్టి పక్కకు జర్పి 'అరే ! ముక్కిడోడ ! మొకానికి ముక్కే ఆసర అన్నరు, నీకా ముక్కేలేక పాయె; మరి బాలి ఎందుకురా? నీకు? అంట అంటుండంగనె ముక్కిడోడు కోడిపుంజోలె లేసి,

''అరే ! ఈడ్పు గాళ్లోడ, పది కిలోల కాయితాల బస్తమోయలేనోడ ! బాలిని యాడ మోస్తవుర ? తంతినంటె నడ్డినీర్గి సస్తవ్‌కొడ్క !ఈ యాళ్ల బాలి నాది '' అన్నడు.

''అరే ! ఎట్లదంతవొ ? తన్నుకొడ్క ! మొకాన జాడిచ్చితంతినంటె పండ్లూడి సేతులరాలాలె కొడ్క ! అంట బాలిని అవుతలికి జర్పి ఒగరి మీద ఒగరు వడి కొట్టుకోనికె పూన వట్టింద్రు.

ఇంతట్లకె వోతొమ్మిదేండ్ల బుడ్డోడు యిత్తడి తబుకుల ఎంకటేశ్వర్ల ఫోటు వెట్టి 'అయ్యా ! ఏడుకొండలోనికి యాగళ్లు, అమ్మా ! యాగళ్లు, అంట వొచ్చి నిలవడ్డడు. ఇంగ ఆడున్నోళ్లల్ల కొంత మంది ఛీ ! పో, నీకు పని లేదా ! అంట సేదరిచ్చుకుంటె ? కొందరు మొకాలు అటుదిప్పుకున్నరు, గని, ఇంత పగతోటి, తామ సంవొచ్చి కుస్తీపట్లకు దిగిన మన ముర్కి బొంతలు మట్కు, ఎంకటేశునిమాట ఇనంగనే 'కుంజి 'ఇచ్చినట్ల కోపతాపాలు ఇడ్సి, నడ్మల జెక్కుకున్న పైసల సంచులు దీసి తలో పది పైసల బిల్ల బుడ్డోని స్తాంబాళంల ఏసి బొట్టు దీస్క పెట్టుకోని చెంపలేస్కున్నరు. ఆచేతనే బాలికి చెరోపావుల ఇచ్చిన్రు. అది పాపం కండ్లల్ల ఎలుగులు జిమ్మంగ ఆపైసలు అందుకోని వస్తనె ! మావలు ! అంట బాట వట్టింది. ఇద్దరు సప్పున జల్లారింద్రు.

ఇది ఇట్లుండంగ, చెత్తకుండి సుట్టు వో నాలుగైదు, కుక్కలు బౌ, బౌ,మంట సుట్టు దిర్గుతుండయ్, కుండిలోపటి నుంచి వో ఆర్సమైన కుక్క సప్పుడు అంత కన్న జోరుగ ఇనరా వట్టింది.

ఏందో కుక్కల గుణం? మొరుగుడు ! వాటికి అంతకన్న పని యాండది ? మొర్గుతె మొర్గనీ ! అంట ఎవ్వరు వట్టిచ్చుకోలేదు. వచ్చే బస్సులు రాక అందరు యాష్ట పడ్తుండరు ,

ఎవరితిప్పల్ల వాళ్లుండంగ పక్కఇంటి పని మనిషి రాత్రి దావతుల వగిల్న గిలాసులు, బీరు, బరండి సీసలన్ని వూడ్సుకొచ్చి కోపాన జాడిచ్చి చెత్త కుండిల దబక్కున గుమ్మరిచ్చింది, అట్ల జాడిచ్చి దుల్పుకానికి ముందె గాజప్పముక్కలాయె, అవి రప్పు మంట వోయి తాకి రంపాలోలె చీర్వంగ నెత్తి వగిలి ముక్కూ మొకం యాది గాన్రాకుండ నెత్తుర్లు వోరుదలు గట్టంగ సస్తినబ్బో అంట కాలి కొరకచ్చెన మనిషోలె వో

ఆకారం చెత్తకుండినడుంగుల కెళ్ళి లేసి నిలవడ్డది.

అందరు గుడ్లప్పగిచ్చి చూస్తుండరు గని, ఏం మాట్లాడ్త లేరు. ఇంద్రజాల పోడు టిన్ను డబ్బుల కెళ్ళి సెట్టు మొలిపిచ్చినట్ల చెత్తకుండిల కుక్కవోయి మనిషెట్లాయె ? ఇదేం చిత్రం ? అంట జూస్తుండంగనె, వున్న వాస్తవందెల్సివొచ్చింది.

అది రాయాల్నంటె నాకే చేతులాడ్తలేవు.

ఈపట్నంల పెంపుడు కుక్కలకు రాజబోజినం దొర్కుతదిగని, వూరకుక్కలకు కుక్కగతి తప్పదు; కన్నముర్కిదినుడు అవిటికి అలువాటు. అందుట్ల యాదన్న ఎంగలి ఇస్తారు. దొర్కిందంటే, ముందు కలెవడి, దాన్ని కుక్కలు జింపిన ఇస్తారు జేస్తయి. అది వాటికి పుట్టకతోటి వొచ్చిన గుణం .ఇంగ అసొంటి కుక్కల తోటి మనిషి పోటివడ్తనంటె వూకుంటాయి?

ఇప్పటి మనకొరకచ్చు, కడీనమైన బత్కు బతుక్కుంట, సెత్తకుండి బోర్లిచ్చి కాయితా లేర్కోవాల్నంటే సపాయి జవానుకు రూపాయి పన్నుగట్టాలె; కొత్త బ్యారంల రూపాయి ఎళ్లక ఎవ్వరు జూడకుండ పురాగ కుండిలదిగి కూసోని పడ్డకాయితం పడ్డట్లె ఏర్కోని సంచి నింపుకోని ఎవ్వరు జూడకుండ ఇవుతలికి దుంకి పోయెటోడు.

ఇంగ కుక్కలు గిన సుట్టు జేరిమొర్గితే, అవి కరుస్తవి అన్న బయానికి కుక్కల కన్న పెద్దగ అంటె తానో పెద్ద కుక్క తీర్గ అరుస్తుండె. ఇట్లా తంతులు వన్ని కుక్కల కన్నుగప్పి, సపాయి జవానుకు దొర్కకుండ బత్కెటోడు . ఈయాల్ల పాపం ఎవరి మొకంజూసి లేశిండో ? యాక్రెపిల్లి బాటకు అడ్డం వొచ్చిందొ ? గని, తన సంచి దబ్బున నిండింది. అనేకుశాలుతోటి ఏరుడు సాల్జేసి పోతననుకున్న యాల్లకే ఆ ఎదురింటి పనిమనిషి వొచ్చి గాజుపెంకులు గుమ్మరియ్యంగ నెత్తి వగలి, దయ్యెమోలె నిలవడ్డ మన మనిషి.

మనంద్ల ఒకడైన మనిషి, రేపు నోటు ఏసి మన నెత్తిన ఏలికలను నిలవెట్టే మనిషి రేపుతానూ తండ్రి ఐ తన సంతతిని పెంచి చిప్పలు చేతికిచ్చే మనిషి మంచికీ, చెడ్డకు, మురికికీ, శుభ్రానికి, నర్కానికీ సొర్గానికి ఏరు తార్లు దెల్వని మనిషి .నిజంగా వాడు మనిషే అంటవ ? అయితే ? ఇంత నిక్రుష్టపు జీవితానికి కారణం ఏంది. ?

తప్పు ఎవరిది ? పుట్టిచ్చిన దేవుణిదా? కని, పెంచశాత గాని తలి దండ్రిదా? సంఘానిదా? ప్రభుత్వానిదా? వాని పనికిమాలిన కుక్క బుద్దా ? సోమరితనమా ?

ఎవరు వుద్దరిస్తరు? ఈ ఎంగిలి బత్కులు అంట నా మనుసు అంత అతులం కుతలం అయితుండది. ఏం జెయ్యాల్నో తోచక నీకు రాస్తుండ...

ఇంగ మీరేమంటరో ?

ఇదమ్మ సెల్లెరాసిన వుత్తురం ! అని రాదమ్మ అంటె యిద్దరు కండ్లొత్తుకున్నరు.